ప్రత్తిపాడు.. ప్రగతి చూడు

- వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రత్తిపాడులో ప్రగతి పరుగులు
- పాలనా సౌలభ్యతకు సచివాలయ భవనాలు
- నాడునేడు కింద పూర్తిగా మారిపోయిన పాఠశాలలు, ఆస్పత్రుల స్వరూపం
- తాగునీటి వాటర్ ట్యాంకు, ఆర్వో ప్లాంట్ల నిర్మాణం
- రైతులకు ఆర్‌బీకెలు, అగ్రి ల్యాబ్‌ల ఏర్పాటు
- అంతర్గత వీధుల్లో సీసీ రోడ్లు


ప్రత్తిపాడు వీక్షణం

ప్రత్తిపాడు: గడిచిన 59 నెలల కాలంలో ప్రత్తిపాడు స్వరూపమే మారిపోయింది. ప్రగతి పట్టాలపై పరుగులు తీసింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పాలనలో ఒక్కో రంగంలో మార్పు ప్రస్ఫుటంగా కనిపించింది. నాడునేడు కింద పాఠశాలలకు హంగులొచ్చాయి. కార్పొరేట్ వాతావరణంతో శోభిల్లాయి. పాలనా సౌలభ్యతకై మణిమకుటంగా నూతన సచివాలయ భవనాలు అందుబాటులోకి వచ్చాయి. అన్నదాతలకోసం రైతు భరోసా కేంద్రం, అగ్రిల్యాబ్, ప్రజల ఆరోగ్య సంరక్షణకై ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధునికీకరణ, స్వచ్ఛమైన తాగునీటినందించే వాటర్ ట్యాంకులు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా పేదల చిరకాల స్వప్నం సొంతిల్లు సాకారమైంది. జగనన్న ఇళ్ల రూపంలో కొత్త ఊళ్లకు ఊపిరిపోయడం జరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే అభివృద్ధి జాడలు ఇన్నిన్ని కావయా అనేంతలా ఉందంటే అతిశయోక్తి లేదు.

ఎమ్మెల్యే సుచరిత సహకారంతో ..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానిక ఎమ్మెల్యే మేకతోటి సుచరిత చొరవతో ప్రత్తిపాడు కొత్త పుంతలు తొక్కింది. అటు సంక్షేమ పథకాల మంజూరు, ఇటు అభివృద్ధి పనుల మంజూరులో అడుగడుగునా సహకరించారు.

ప్రత్తిపాడు పంచాయతీ అభివృద్ధి పనుల్లో కొన్ని..

- నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో రూ. 62 లక్షలతో ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్
- ప్రత్తిపాడులో మూడు గ్రామ సచివాలయ భవనాలు మంజూరు కాగా వాటిలో ఇప్పటి వరకు రెండు భవనాలు పూర్తయ్యాయి. ఒక్కో భవనాన్ని రూ. 45 లక్షలతో నిర్మించారు. మరో భవనం నిర్మాణంలో ఉంది.
- తాగునీటిని అందించేందుకు రూ. 75 లక్షల వ్యయంతో వాటర్ ట్యాంకు
- సుమారు రూ. 60 లక్షలతో సీసీ రోడ్లు
- నాడు నేడు కింద రూ. 6 కోట్ల తో అధునాతన భవంతులతో ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం
- నాడు నేడులో రూ.1.10 కోట్లతో సర్వాంగ సుందరంగా భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.
- రూ. 60 లక్షలతో ప్రత్తిపాడు రక్షిత మంచినీటి చెరువు ఆర్వోఆర్ ప్లాంటు

పరోక్ష పద్ధతి (నాన్ డిబిటి)లో అందిన లబ్ధి వివరాలను చూస్తే..

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.లలో)
ఇంటి స్థలాలు	611	15,13,06,000
విద్యాకానుక	723	51,34,746
విద్యార్థులకు ట్యాబ్‌లు	112	14,80,864
జగనన్న తోడు రుణాలు	573	1,06,68,687
జగనన్న గోరుముద్ద	830	1,10,99,108
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	823	1,32,44,332
ఇంటింటికీ రేషన్	4024	8,79,20,256

సంక్షేమ పథకాలు ప్రత్యక్ష పద్ధతి (డీబీటీ) అందిన లబ్ధి

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	వెచ్చించిన నిధులు (రూ. లక్షల్లో)
అమ్మఒడి	1448	659.00
జగనన్న విద్యాదీవెన	887	331.24
జగనన్న వసతి దీవెన	662	112.45
వైఎస్సార్ రైతు భరోసా	1378	661.84
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	914	63.48
వైఎస్సార్ సున్నా వడ్డీ (పంటరుణాలు)	274	8.63
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	35	3.41
వైఎస్సార్ పెన్షన్ కానుక	2113	1971.84
వైఎస్సార్ చేయూత	868	387.03
వైఎస్సార్ ఆసరా	2577	1287.01
వైఎస్సార్ సున్నా వడ్డీ (డ్వాక్రా)	3092	59.57
వైఎస్సార్ కాపు నేస్తం	92	40.5
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	233	63.3
వైఎస్సార్ కల్యాణమస్తు	4	3.50
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	673	290.47
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	393	28.99
హౌసింగ్ (లబ్ధిదారులకు నేరుగా చెల్లింపు)	428	410.03
వైఎస్సార్ బీమా	36	57.3
వైఎస్సార్ వాహనమిత్ర	119	31.3
జగనన్న చేదోడు	428	410.02
కోవిడ్ సాయం	3784	37.84 (కోట్లు)
జగనన్న తోడు	223	0.90

అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గ్రామ స్వరూపమే మారిపోయింది. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా సాగిన ఆయన పాలనలో ఎందరో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ప్రాధాన్యతా క్రమంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు.

–బాపతు వెంకటేశ్వరరెడ్డి, ప్రత్తిపాడు

ఇంతకంటే ఏం కావాలి మాకు?



పేదలందరికీ ఇంటి స్థలమిచ్చారు. తర్వాత ఇంటిని మంజూరు చేశారు. ఇప్పుడు ఇళ్ల స్థలాలిచ్చిన ప్రాంతం ఒక కాలనీ అయిపోయింది. ఒక్కొక్కటిగా వసతులు సమకూరుతున్నాయి. సంక్షేమ పథకాల సంగతి వేరే చెప్పాల్సిన పనిలేదు. అర్హత ఉంటే చాలు .దరఖాస్తు చేసుకుంటే నేరుగా పథకం అందిపోతుంది. ఇంతకంటే ఏం కావాలి మాకు?

–షేక్ మెహరున్నీసా, ప్రత్తిపాడు


నాడు -నేడులో.. కోటి రూపాయలతో ఆధునికీకరించిన ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల


అంతర్గత సీసీ రోడ్లు


జగనన్న హౌసింగ్ లే అవుట్‌లో నిర్మించిన ఇళ్లు

క్లుప్తంగా

గ్రామాల్లో ఫ్యాన్ ప్రచార జోరు



గుంటూరు రూరల్: ఈ ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి అభిమాన నాయకులను గెలిపించాలంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు, నాయకులు గ్రామగ్రామాన ప్రచారాన్ని హోరెత్తించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం గోరంట్లలో ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య తనయురాలు కిలారి సాయి ఇంటింటికి తిరిగి ఫ్యాన్‌గుర్తుకు ఓటేయాలంటూ ప్రజల్ని అభ్యర్థించారు. తన తండ్రినిని, అదేవిధంగా ఎమ్మెల్యే అభ్యర్థి కిరణనన్నను గెలిపించాలని కోరారు. చిన్నపలకలూరులో జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, మిర్చియార్డు డైరెక్టర్ ఇంద్రలు శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. జొన్నలగడ్డలో ఏఎస్ఆర్ సీడ్స్ అధినేత ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ పులగం శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష సుధాకర్ ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందించారు. చల్లావారిపాలెం, నల్లపాడులో ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దుగ్గెంపూడి కిషోర్‌రెడ్డి, చల్లావారిపాలెం ఆరుదల సాంబశివరావు, నల్లపాడు కార్పోరేటర్ చల్లా రాజ్యలక్ష్మి ఇంటింటి ప్రచారం చేపట్టారు. పెదపలకలూరులో నూనె దశరధరామిరెడ్డి, పతకమూరి రామకోటేశ్వరరావు, వెంకటరామయ్య స్థానిక నాయకులతో ప్రచారంలో పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ



గుంటూరు రూరల్: నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రత్తిపాడు నియోజకవర్గ సమస్యాత్మక గ్రామం బుడంపాడులోని పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ తుషార్ డూడి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో పర్యటించి ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలను, బందోబస్తుకు సంభందించిన విషయాలను అధికారులకు వివరించారు. పాఠశాల చుట్టు పక్కల నివాసం ఉంటున్న ప్రజలతో మాట్లాడి ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీసులకు సహకరించాలని కోరారు. పోలింగు రోజున పోలింగు కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఓటు హక్కు వినియోగించుకునే వారు తప్పా ఇంకెవ్వరూ ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట ట్రైనీ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, నల్లపాడు పోలీస్ స్టేషన్ సిఐ నరేష్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

మలినేనిలో విజయోత్సవ్ - 2024

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విజయోత్సవ్ 2024 పేరుతో ప్లేస్‌మెంట్ డేను నిర్వహించారు. ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న 370 మంది విద్యార్థినులకు వివిధ కంపెనీలలో ఉద్యోగావకాశాలు లభించిన నేపథ్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు హాజరై విద్యార్థులకు సలహాలందించారు. కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లుతో కలిసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సన్మానించారు.కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ కె. శ్వేత, ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ దేవిరెడ్డి శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చెప్పాడంటే చేస్తాడంతే

- ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్
- 48వ డివిజన్ రెడ్డిపాలెంలో ఎన్నికల ప్రచారం


ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆచరణ సాధ్యం కాని పనుల ఎన్నడూ చెప్పరని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా 48వ డివిజన్ రెడ్డిపాలెంలో ఎన్నికల పర్యటించారు. ఈ సందర్భంగా దారిపొడవునా బలసానికి పార్టీ నాయకులు కార్యకర్తలు సాదరంగా ఆహ్వానించారు. మహిళలు హారతులు, విజయ తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. తీన్‌మార్ డప్పులు, డీజేలు, బాణసంచాతో వైఎస్సార్‌సీపీకి, జగనన్నకు, ఫ్యాన్ గుర్తుకు మద్దతు తెలిపారు. పూల వర్షాన్ని కురిపించి అభిమాన నాయకుడికి నీరాజనాలు పలికారు. అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని మాట్లాడుతూ జగనన్న పాలనలో దళితులు, పేదలు, అగ్రవర్ణాల్లోని పేదలకు సైతం సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందాయన్నారు. అదేవిధంగా ఈ సారి మేనిఫెస్టోలో పథకాలను మరింత మెరుగు పరిచి ప్రజలకు అందించేందుకు జగనన్న సిద్ధంగా ఉన్నారన్నారు. ఈనెల 13న జరిగే పోలింగ్ లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ,అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. జగనన్న గెలిస్తేనే ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ ఎన్నికలు ముగిసిన అనంతరం చంద్రబాబు ఆతని భజన సేనానులు హైదరాబాద్ కు వెళ్లిపోతారని, రాష్ట్రం వైపు కన్నెత్తైనా చూడరని బలసాని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పోరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, యార్డ్ డైరెక్టర్‌లు, వివిధ కార్పోరేషన్‌ల డైరెక్టర్‌లు, వివిధ అనుభంద విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి ఓటేద్దాం


ఎన్నికల ప్రచారంలో ఆళ్ళ చరణ్‌రెడ్డి, ఆళ్ళ పవన్ కుమార్‌రెడ్డితో స్థానిక నాయకులు

పెదకాకాని: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలంటూ ఆళ్ల సోదరులు చరణ్‌రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. పెదకాకాని మండలం ఉప్పలపాడులో బుధవారం స్థానిక నాయకులతో ఆళ్ల అయోధ్యరామిరెడ్డి తనయుడు చరణ్ రెడ్డి, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి(ఆర్‌కె) తనయుడు పవన్‌కుమార్‌రెడ్డిలు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆళ్ళ చరణ్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించి వేల మందికి వెలుగులు పంచిన మనసున్న వ్యక్తి అంబటి మురళికృష్ణ అన్నారు.ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మురళికృష్ణతోపాటు, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యలను మెజారిటీతో గెలిపించాలని కోరారు.. కార్యక్రమంలో కృష్ణా పశ్చిమడెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ వుయ్యూరి సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు దంతాల శివపార్వతి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, పెరుమాళ్ళ అనిల్‌కుమార్, సొసైటీ చైర్‌పర్సన్ శివాబత్తుని దయానంద్, ముద్రబోయిన నాగేశ్వరరావు, మెండాల నాగభూషణం, పెద్దిపాగ ఫ్రాన్సిస్, పల్లెంపాటి శ్రీను, పలువురు వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే రజకులకు సముచిత స్థానం

రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు అంజిబాబు


ఇంటింటి ప్రచారంలో రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పాతపాటి అంజిబాబు

ప్రత్తిపాడు: రజకులకు అండ వైఎస్సార్‌సీపీ జెండా అని ఆ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు పాతపాటి అంజిబాబు అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో బుధవారం స్థానిక సంఘ నాయకులతో కలిసి వైఎస్సార్ సీపీకి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎం చేసుకుందామని రజకులకు పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనదైన శైలిలో రజకుల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఎన్నికల మేనిఫెస్టోలో రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామంటూ చంద్రబాబు చెప్పే మాటలను ఇకపై నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రజకుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చంద్రబాబు వైఫల్యం చెందారని విమర్శించారు. తాజా మేనిఫెస్టోలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలుచేస్తోన్న పథకాలను కాపీ కొట్టి వాటికి అదనపు ప్రయోజనాలు కల్పిస్తానంటూ బాబు చెబుతుండటాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. చంద్రబాబుకు, కూటమి నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని అంజిబాబు అన్నారు. మాజీ సర్పంచ్ మూలె శ్రీనివాసరెడ్డి, ప్రత్తిపాడు మండల రజక సంఘాల ఐక్య వేదిక మండలాధ్యక్షుడు ఉద్దగిరి సురేష్, బాపతు గోవింద్ రెడ్డి, నోటు సుధాకర్ రెడ్డి, షేక్ బాషా, రజక సంఘ నేతలు ఉదయగిరి వీరయ్య, ఆకునూరి బాజి, రాచమళ్ల సాంబశివరావు, గవళ్లపల్లి ముత్యాలు, గవళ్లపల్లి నాగరాజు, బాదుగుల వెంకటేశ్వర్లు, బాదుగుల సురేష్, గవళ్లపల్లి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే పేదల అభ్యున్నతి


శ్రీరంగపురంలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

- వైఎస్సార్‌సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- మంచాల, తోట్లపాలెం, శ్రీరంగపురంలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

చేబ్రోలు: పేదల అభ్యున్నతి, రాష్ట్ర ప్రజానీకానికి మరింత మేలు జరగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి రావాలని పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం మంచాల, తోట్లపాలెం, శ్రీరంగపురం గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం అందించిన మంచిని వివరించారు. మహిళలు దిష్టి తీసి, హారతులు పట్టారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. , ఆయన హయాంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు సకల వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమం కొనసాగిస్తూ ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నారాకోడూరులో వర్షంలోనూ ప్రచారం

నారాకోడూరులో రాత్రి వైఎస్సార్‌సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ప్రచారాన్ని చేపట్టారు. ఈ ప్రచారానికి స్థానికులు బ్రహ్మరథం పట్టారు. వర్షంలో ప్రచార రథంపై నుంచి స్థానికులకు అభివాదం చేస్తూ అంబటి ముందుకు సాగారు. మహిళలు, యువకులు, స్థానికులు అడుగడుగునా జై జగన్ ..జై అంబటి నినాదాలు చేస్తూ, ఉత్సాహంతో ముందుకు కదిలారు.

అన్నపర్రు టీడీపీలో 'బూర్ల' మంట

- ఇరువర్గాల మధ్య కొట్లాట.. గాయపడ్డ ఎన్ ఆర్ ఐ
- నడి రోడ్డుపై తన్నుకున్న తెలుగు తమ్ముళ్లు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు అన్నపర్రు టీడీపీలో చిచ్చు పెట్టారు. ఆయన నియోజకవర్గంలోకి అడుగు పెట్టిన నాటి నుంచి గ్రామాల్లో వర్గపోరును ప్రోత్సహిస్తూ ఒక వర్గానికి కొమ్ముకాస్తూ, మరో వర్గాన్ని పక్కనబెడుతూ వస్తున్నారనే ఆరోపణలకు తాజా ఘటన అద్దం పట్టింది. వివరాల్లోకి వెళితే.. పెదనందిపాడు మండలం అన్నపర్రులో బుధవారం రాత్రి బూర్ల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదే గ్రామంలో ఉన్న ఓ వర్గానికి ప్రాధాన్యతను ఇచ్చి, మరో వర్గాన్ని విస్మరించడంతో పాటు, మాజీ సర్పంచ్ ఇంటికి వెళ్ళకుండానే గ్రామంలో ప్రచారం ముగించి అర్ధంతరంగా వెళ్లిపోయారు. ఈ విషయమై గ్రామంలో ఇరువర్గాలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరిగి బాహాబాహీకి దారితీసింది. సహనాన్ని కోల్పోయిన ఇరువర్గాలవారు నడి రోడ్డుపైనే విచక్షణారహితంగా తన్నుకున్నారు. ఈ దాడిలో నాగులపాడు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐపై అదే పార్టీ కి చెందిన టీడీపీ క్యాడర్ దాడి చేసింది. దీంతో ఆయనకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఎస్ ఐ తమ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహిస్తున్నారు. దాడిలో గాయపడిన ఎన్ఆర్ఐ అమెరికాలో పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు సమాచారం.

జోరుగా ప్రచారం


21వ వార్డులో మాజీ కౌన్సిలర్ నయీంబాషా ఆధ్వర్యంలో ప్రచారం


ఆలూరులో బూత్ కమిటీ ప్రచారం

పొన్నూరు: ఎన్నికలకు పోలింగ్ దగ్గరపడుతోంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు తమ ప్రచార జోరును ముమ్మరం చేశాయి. ర్యాలీలు, ప్రచారాల్లో పాల్గొంటున్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యకు మద్దతుగా ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలంటూ ప్రజలను అభ్యర్థించారు.


28,29 వార్డుల్లో ప్రచారంలో పాల్గొన్న పార్టీ పట్టణ అధ్యక్షులు ఎంఏ. మహమూద్ తదితరులు


18వ వార్డులో ప్రచారంలో పాల్గొన్న అంబటి మురళీకృష్ణ కుటుంబ సభ్యులు